# ఎగ్జిట్ పోల్స్ బూటకం

- హ్యాట్రిక్ సీఎం కేసీఆరే..
- కాంగ్రెస్ కుల, బీజేపీ మత రాజకీయాలు చేసింది
- సురభి నాటకాలను వారిని మించి కాంగ్రెసోళ్లు నటిస్తుండ్రు
- శ్రీకాంతాచారి చనిపోయినప్పుడు రేవంత్ మీరెక్కడున్నారు..?
- 3వ తేదీన అసలైన సంబురాలు మేం చేసుకుంటాం
- విలేకరుల సమావేశంలో ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్


విలేకరులతో మాట్లాడుతున్న ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్, డిసెంబర్ 1 : ప్రజల గుండెల్లో బీఆర్‌ఎస్ పదిలంగా ఉందని ఎగ్జిట్ పోల్స్ అన్ని ఓ బూటకమని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ స్పష్టం చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ మంత్రి చంద్రశేఖర్ తదితర ప్రజాప్రతినిధులతో కలిసి మాట్లాడారు. కాంగ్రెసోళ్లు కుల, బీజేపోళ్లు మత రాజకీయాలు చేసి ప్రజలను ఇబ్బందులకు గురి చేశారన్నారు. కేవలం 30రోజులు వారు నటించడానికి మాత్రమే ఇక్కడికి వచ్చారని, ఎంతో మందిని ఎన్నో రకాలుగా ఇబ్బందులు పెట్టారన్నారు. అప్పుడే ఓడిపోతాం అంటే వెనుకున్న వారే కరవవుతారని, మాయమాటలు చెబుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎవరు గెలిచిన కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ముందు బెంగుళూర్‌లో ఉంచేందుకు వారు ప్లాన్ చేయడం వెనుక ఉన్న అర్థం ఎటు వైపు దారితీస్తుందన్నారు. వారికి వారే ఒక దగ్గర కూర్చొని లేనిపోని మాటలు మాట్లాడి జనంలోకి వెళ్లేలా చేశారని ఇది ఎంతో మోసపూరితమైన నాటకం ఆడారని ఆరోపించారు. సురభి నాటకాలు వేసే వారి కంటే కాంగ్రెసోళ్లు చేసిన నాటకాలు బా గున్నాయని ఎద్దేవా చేశారు. రైతులకు మంచి చేయాలనే తపనతో రైతు బంధు పెడితే ఆ డబ్బులను కూడా నిలిపిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కుతుందన్నారు. ఇప్పటికే ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రైతుబంధు రైతులకు ఎందుకు అని మాట్లాడుతున్నారని, పది మంది సీఎంలమంటు కాంగ్రెసోళ్లు ఎన్నో మాటలు మాట్లాడుతున్నారని, వారి చేతిలో తెలంగాణ ఉండదని, నూరుకు నూరుశాతం బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. వాళ్ల వెంబడి ఉన్న వారే బీఆర్‌ఎస్‌కు ఓటు వేశామని చెప్పారని, కారు గుర్తు చూస్తే ఏ గుర్తు గుర్తుకు రాదన్నారు.

**మీ సంబురాలు కొన్ని రోజులే..**

ఈ నెల 3వ తేదీన 8 గంటలలోపు కాంగ్రెస్ పార్టీ వారు సంబురాలు చేసుకునేందుకు అవకాశం ఉందని మంత్రి అన్నారు. వారు చేసుకునేవి, సంబుర పడుతున్నవి కేవలం కల్పితమైనవని, మేం ఈ నెల 3వ తేదీన 9గంటల తరువాత నిజమైన సంబురాలు చేసుకుంటామని చెప్పారు. కిరాయి ముఠాలతో కాంగ్రెస్ పార్టీ వారు బూటకపు రాజకీయం చేశారని, అది ఎంతో కాలం నిలవదన్నారు. మాకు సర్వేలు ఉన్నాయని, మంచి మెజార్టీ రావడం ఖాయమన్నారు. హంగ్‌కు చాన్స్‌లేదని, సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ పక్కా అని ధీమా వ్యక్తం చేశారు. 2018ఎన్నికల్లోను కూడా ఇలాగే అన్నారని, చూస్తే మైండ్‌బ్లాక్ అయ్యేలా బీఆర్‌ఎస్‌కు 88 సీట్లు వచ్చిన విషయం అందరికీ తెలుసన్నారు. గిప్పుడు కూడా రాసిపెట్టుకుని చూడండి 71 నుంచి 81 సీట్లు బీఆర్‌ఎస్‌కు రావడం ఖాయం అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, వైస్‌చైర్మన్ గణేశ్, గ్రంథాలయాల సంస్థ జిల్లా చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ రహెమాన్, రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు గోపాల్‌యాదవ్, ముడా చైర్మన్ గంజి వెంకన్న, గొర్రెల కాపారుల సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణమోహన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

# నూతన మద్యం పాలసీ అమలు

- ఒకటి నుంచే అందుబాటులోకి వచ్చిన కొత్త వైన్ షాపులు
- జిల్లాలో 36 మద్యం దుకాణాలు
- టెండర్ల ద్వారా రూ.21.58 కోట్లు
- గత పాలసీలో రూ.వెయ్యికోట్ల అమ్మకాలు

గద్వాల అర్బన్, డిసెంబర్ 1 : జిల్లాలో 2023-25 సంవత్సరానికి డిసెంబర్ 1నుంచి నూతన మద్యం పాలసీ అమలులో ఉండనుంది. రెండు సంవత్సరాల పాటు ఈ పాలసీ అమలులో ఉంటుందని తెలంగాణ ప్రభుత్వం వెల్లడించింది. రెండేళ్ల పాటు కొనసాగిన మద్యం పాలసీ గురువారంతో ముగిసింది. శుక్రవారం నుంచి కొత్త మద్యం పాలసీ విధానం అమల్లోకి రానుంది. పాత మద్యం దుకాణాలు నిర్వహించే వ్యాపారులకు చాలా వరకు రాకపోవడంతో ఇకపై ఏం చేయాలనే అలోచనలో పడ్డారు. కొత్తగా దుకాణాలను సొంతం చేసుకున్న వారితో కొందరు వ్యాపార ఒప్పందం కుదుర్చుకున్నారు. 2019-2021 మద్యం షాపుల లైసెన్స్ ముగియడంతో కొత్త మద్యం దుకాణాలకు తెలంగాణ ప్రభుత్వం టెండర్లు నిర్వహించింది. ఈ నేపథ్యంలో జిల్లాలో 36 మద్యం షాపులకు 1,079 దరఖాస్తు చేసుకొగా.. అందులో లక్కీ డిప్ ద్వారా 36 మందిని ఎంపిక చేశారు. ఎంపికైన వారికి మద్యం దుకాణాలకు లైసెన్స్‌లు మంజూరు చేసినట్లు అధికారులు వెల్లడించారు. 2017-2019 పాలసీ కాలంలో మద్యం డిపోల నుంచి రూ.600 కోట్ల మద్యం అమ్మకాలు జరగగా, 2019 నవంబర్ నుంచి 2021 నవంబర్ 30 వరకు డిపోల నుంచి రూ.800 కోట్ల అమ్మకాలు జరిగినట్లు ఎక్సైజ్ అధికారులు వివరించారు. 2021 నవంబర్ నుంచి 2023 నవంబర్ వరకు దాదాపు రూ.1,000 కొట్ల మద్యం అమ్మకాలు జరిగినట్లు అధికారులు పేర్కొన్నారు. జిల్లాలో కొత్త మద్యం దుకాణాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో గురువారం నుంచి హడావుడి మొదలైయింది.

**నియమ నిబంధనలు తప్పనిసరి**



మద్యం అమ్మకాలు నిర్వహించే దుకాణ నిర్వాహకులు తప్పనిసరిగా అబ్కారీ శాఖ అధికారులు తెలిపిన నియమ నిబంధనలు పాటించాల్సిందే. 18 ఏండ్ల లోపు ఉన్న బాలురకు మద్యం అమ్మరాదు. అలాగే డ్రైవర్‌లకు మద్యం అమ్మరాదు. అత్యధికంగా మద్యం కొనుగోళ్ల వివరాలు, మద్యానికి సంబంధించి రికార్డులు, మద్యం మీద నిర్ణయించిన ధరలకే సరఫరా చేయాలి. లేదంటే దుకాణాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం

-సైదులు, ఎక్సైజ్ సూపరింటెండెంట్, జోగుళాంబ గద్వాల జిల్లా

# రికార్డు స్థాయిలో ధాన్యం ధరలు

- క్వింటా రూ.3156కు చేరిన ధాన్యం
- ఆర్‌ఎన్‌ఆర్‌కు దీటుగా హంస ధరలు


బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన ధాన్యం

జడ్చర్ల, డిసెంబర్ 1: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం ధరలు రోజురోజుకు పెరుగుతూనే ఉన్నాయి. ఆర్‌ఎర్‌ఆర్‌కు ధరలు పెరుగుతుండగా హంసకు ధరలు అంతగా ఉండేవి కావు. కానీ హంసకు కూడా గత మంగళవారం నుంచి ధరలు బాగా పెరిగాయి. ఆర్‌ఎన్‌ఆర్‌కు క్వింటా రూ.3,156 రాగా హంస రకం క్వింటా రూ.2.901ధరలు పెరిగాయి. అంటే దాదాపు ఆర్‌ఎన్‌ఆర్‌కు దగ్గరగా హంస ధరలు వచ్చాయి. ధాన్యంకు ఈస్థాయిలో ధరలు రావడం ఇదే మొదటి సారి. ఆర్‌ఎన్‌ఆర్ రకం ధాన్యం ధరలు క్వింటా రూ.3,156 వేలకు చేరుకుంది. బయటి మార్కెట్‌లో ఆర్‌ఎన్‌ఆర్‌కు బాగా డిమాండ్ పెరగడంతో వ్యాపారులు అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో జిల్లాలోనే బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం ధరలు అధికంగా పలుకుతున్నాయి. మార్కెట్ చరిత్రలో ఇంతటి ధరలు ఎన్నడూ రాలేదని వ్యాపారులు, మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ధాన్యంకు ధరలు అధికంగా వస్తుండడంతో రైతులకు మంచి ఆదాయం లభిస్తుంది. వరి వేస్తే నష్టం వస్తుందనుకుంటున్న రైతులకు ఈ ధరలు ఆనందాన్ని కల్గిస్తున్నాయి. బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌కు శుక్రవారం ధాన్యం, మొక్కజొన్న, జొన్న, అమ్మకానికి వచ్చాయి. మార్కెట్‌కు 13,680 క్వింటాళ్ల ఆర్‌ఎన్‌ఆర్ రకం ధాన్యం అమ్మకానికి రాగా దానికి క్వింటాకు గరిష్ఠంగా రూ.3,156, కనిష్ఠంగా రూ.1,818, మధ్యస్తంగా రూ.2,921 ధర పలికింది. అదేవిధంగా 318 క్వింటాళ్ల మొక్కజొన్న అమ్మకానికి రాగా దానికి క్వింటాకు గరిష్ఠంగా రూ.2,321, కనిష్ఠంగా రూ.2,169, మధ్యస్తంగా రూ.2,169 ధర వచ్చింది. అలాగే 481క్వింటాళ్ల హంస అమ్మకానికి రాగా దానికి క్వింటాకు గరిష్ఠంగా రూ.2,901ధర పలికింది. 54క్వింటాళ్ల సోన రకం ధాన్యం అమ్మకానికి రాగా దానికి క్వింటాకు గరిష్ఠంగా రూ.2,511 ధర పలికింది. 49 క్వింటాళ్ల శ్రీరాంగోల్డ్ రకం ధాన్యం అమ్మకానికి రాగా క్వింటాకు గరిష్ఠంగా రూ.2,906 ధర వచ్చింది. రెండు క్వింటాళ్ల జొన్నలు అమ్మకానికి రాగా క్వింటాకు గరిష్ఠంగా రూ.1,912 ధర పలికినట్లు అధికారులు తెలిపారు.


కడ్తాల్ : మైసమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

## మైసిగండిలో వైభవంగా అమ్మవారి ఉత్సవాలు

కడ్తాల్, డిసెంబర్ 1 : ఉమ్మడి పాలమూరు జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన మైసిగండి మైసమ్మతల్లి జాతర ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. జాతర ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయంలో కార్తీక దీపోత్సవం సందర్భంగా మహాలింగార్చన, పుష్పార్చన, అమ్మవారికి విశేష పూజలు, అర్చనలు, హారతులు తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారిని భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో స్నేహలత, ట్రస్ట్ చైర్మన్ శిరోలీపంతూనాయక్, ఆలయ నిర్వాహకులు భాస్కర్‌నాయక్, అరుణ్‌కుమార్, ఆలయ సిబ్బంది యాదగిరిస్వామి, బోడియానాయక్, కృష్ణ, రాములు, చంద్రయ్య, దేవేందర్, రమాదేవి, హర్షవర్ధన్, వెంకటేశ్, విజయ్, మహేశ్, శ్రీనివాస్, రామకృష్ణ, బీబీ చారి, భక్తులు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్‌కు అండగా నిలిచిన ప్రజలకు ధన్యవాదాలు

- ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు



అచ్చంపేట, డిసెంబర్ 1: నియోజకవర్గ ఓటర్లు మరోసారి బీఆర్‌ఎస్ పార్టీకి అండగా నిలబడిన ప్రజలకు ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ధన్యవాదాలు తెలిపారు. సోమవారం అచ్చంపేటలోని తన నివాసంలో గువ్వల మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మద్యం, డబ్బులు లెక్క చేయకుండా సారు రావాలి, కారు గెలవాలి, గువ్వల బాలరాజు విజయం సాధించాలని ప్రజలు, యువఓటర్లు, మహిళలు, పేదలు అండగా నిలబడి అచ్చంపేటలో మరోసారి కారు గెలుపునకు దోహదపడుతున్న అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ ఆగడాలు, దాడులను ఎదుర్కొని బెదిరింపులను భరించి, విచక్షణ కోల్పోయి పోలింగ్ కేంద్రాల వద్ద అరాచకాలు సృష్టించినా, కులపిచ్చి, మత పిచ్చితో చేసిన ఆగడాలు లెక్కచేయకుండా వాటిని తిప్పికొట్టి గువ్వల బాలరాజు సేవకుడిగా ఉండాలని దీవించి ఓటు వేసిన ప్రజలందరికీ రుణపడి ఉంటానని ఆయన ప్రకటించారు.

## ఆర్టీసీకి రూ.2.13కోట్ల 'ఎలక్షన్' కలెక్షన్లు

- రూ.32 లక్షలతో వనపర్తి అగ్రస్థానం

మహబూబ్‌నగర్‌టౌన్, డిసెంబర్ 1 : శాసనసభ ఎన్నికల సందర్భంగా ఆర్టీసీ మహబూబ్‌నగర్ రీజియన్‌కు భారీ ఆదాయం వచ్చింది. నవంబర్ 29నుంచి 30వ తేదీ వరకు రూ.2కోట్ల 16వేల ఆదాయం రావడం విశేషం. రీజియన్ పరిధిలోని వనపర్తి రూ.32లక్షల 86వేల 689లతో అగ్రస్థానంలో ఉండగా, గద్వాల డిపో రూ.29లక్షల 63వేల 348లతో రెండోస్థానం, నారాయణపేట రూ.25లక్షల46వేల768లతో మూడో స్థానంలో నిలిచింది. అచ్చంపేట రూ.25,22,952, నాగర్‌కర్నూల్ రూ.24,87,107, మహబూబ్‌నగర్ రూ.22,38,930, కొల్లాపూర్ 19,50,194, కల్వకుర్తి రూ.18,57,424, షాద్‌నగర్ రూ.12,65,531, కోస్గి రూ.1,99,078 ఆదాయం వచ్చినట్లు శుక్రవారం ఆర్‌ఎం శ్రీదేవి తెలిపారు. బస్టాండ్‌లో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆమె పర్యవేక్షణ చేట్టారు. డీఎం సుజాత మహబూబ్‌నగర్ డిపో నుంచి హైదరాబాద్‌కు బస్సుల పర్యవేక్షణ చూశారు. శుక్రవారం సైతం ఆర్టీసీ డిపో ప్రయాణికులతో కిటకిట లాడింది. మరో రెండు మూడు రోజుల వరకు ప్రయాణికుల రద్దీ పెరిగి ఆర్టీసీకి మరింత ఆదాయం పెరగనున్నది.

## చెరువులోకి దూసుకుపోయిన తుఫాను

- తప్పిన ప్రమాదం
- క్షేమంగా బయటపడ్డ డ్రైవర్


చెరువులోకి దూసుకుపోయిన తుఫాను

నాగర్‌కర్నూల్, డిసెంబర్ 1: అదుపు తప్పి తుఫాను వాహనం ప్రమాదవశాత్తు నాగర్‌కర్నూల్ కేసరి సముద్రం చెరువులోకి దూసుకుపోయిన ఘటన శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. ఎన్నికల నేపథ్యంలో నాగర్‌కర్నూల్ నియోజకవర్గానికి సంబంధించి ఓ ఎన్నికల అధికారికి తుఫాన్ వాహనాన్ని అద్దెకు ఉంచారు. డ్రైవర్ స్వగ్రామం నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలోని ఎండబెట్ల కావడంతో, విధులు ముగించుకొని రాత్రి ఇంటికి వెళ్లాడు. తెల్లవారుజామున జిల్లా కేంద్రానికి వస్తున్న క్రమంలో ఎండబెట్ల సమీపంలోని బ్రిడ్జి వద్ద వాహనం అదుపుతప్పి చెరువులోకి దూసుకుపోయింది. దీంతో డ్రైవర్ మధు ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకున్నాడు. ఎలాంటి ప్రాణాపాయం జరగలేదు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.